క్లుప్తంగా

పాలక పార్టీ తీరు మారాలి



తాడేపల్లిరూరల్: ప్రతిపక్షంలో ఉంటే ఒకలా, అధికారంలో ఉంటే మరోలా మాట్లాడుతున్న పాలక పార్టీ తీరు మారాలని సీటీయూ తాడేపల్లిపట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్, సీఐటీయూ కార్యాలయంలో ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దుర్గారావు మాట్లాడుతు అధికారంలో ఉన్న పార్టీలు ఉద్యమాలను అణచివేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇటీవల చలో విజయవాడ కార్యక్రమం చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలను రాష్ట్ర వ్యాప్తంగా అడుగడుగునా ఇబ్బందులు పెట్టి వేధించిన సంగతి ప్రజలు, కార్యకర్తలు గుర్తుపెట్టుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ నాయకులు కొప్పనాతి లక్ష్మి, విజయలక్ష్మి, సుగుణ, విజయశ్రీ, కమల, సుజాత, జ్యోతి, కరుణకుమారి, బేబి పాల్గొన్నారు.

స్కౌట్ అండ్ గైడ్ గ్రూపు ఏర్పాటు



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం స్కౌట్ అండ్ గైడ్ గ్రూపును ఏర్పాటు చేశారు. మండల విద్యాశాఖ అధికారి బాబు గ్రూపును ప్రారంభించారు. గ్రూప్‌కు స్కౌట్ మాస్టర్‌గా సాయిబోస్, గైడ్ టీచర్‌గా బాలికల విభాగానికి దేవి ప్రసన్నను ఎంపిక చేశారు. ఈ గ్రూప్ నందు మొత్తం 32 మంది విద్యార్థులు ఉంటారని, టీచర్లకు, విద్యార్థులకు తాడికొండలో ఉన్న భారత స్కౌట్ అండ్ గైడ్ కేంద్ర కార్యాలయం నందు ప్రత్యేక శిక్షణ ఇస్తారని హెచ్‌ఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎంఈవో బాబు మాట్లాడుతూ స్కౌట్ శిక్షణ ద్వారా విద్యార్థుల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం, ఉజ్వల భవిష్యత్తు ఉన్నత విలువలు సమకూరుతాయన్నారు. ఉపాధ్యాయులు పి.మాధవి, పి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర వర్క్‌షాపును జయప్రదం చేయండి



మంగళగిరి టౌన్: ఈనెల 16, 17 తేదీల్లో గుంటూరులో జరుగనున్న వ్యవసాయ కార్మిక సంఘం వర్క్‌షాపును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు కోరారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వ్యవసాయ కార్మికులకు సొంత గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించకపోవడంతో వారు వలసలు పోతున్నట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వాలు స్పందించి, వారి సొంత గ్రామాల్లో ఉపాధి కల్పించి వలసలు నివారించాలని డిమాండ్ చేశారు. అనంతరం వర్క్‌షాపు కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసరావు, సంఘ సభ్యులు దేవుని దయ, మరియదాసు, సత్యనారాయణ, జానీ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



మంగళగిరి టౌన్: పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం పారిశుద్ధ్య పనులను పుర పరిపాలనా శాఖ రీజినల్ డైరెక్టర్ హరికృష్ణతో కలసి ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ తప్పని సరిగా చేయాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరిశుభ్రత పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు అయి స్వచ్ఛ మంగళగిరిగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇందు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు అంజిరెడ్డి భవన్ వద్ద జరిగే పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

భారంగా పశుపోషణ

- హార్వెస్టర్ల వరి కోతతో ఎండు గడ్డి కొరత
- పెరుగుతున్న పశువుల దాణా ఖర్చు
- వేధిస్తున్న సీజనల్ వ్యాధులు
- తగ్గుతున్న పాలదిగుబడి
- ఆందోళనలో పాడి రైతులు



ఎండు గడ్డి మేస్తున్న గేదెలు

తాడేపల్లిరూరల్ : పాడి రైతులకు పశుపోషణ భారమైంది. వ్యవసాయంలో యాంత్రీకరణ చొరబడడంతో..ఎండగడ్డి కొరత కొరత బాగా ఏర్పడింది. ఒక వైపు విపరీతంగా దాణా ఖర్చులు పెరుగుతున్నాయి. మరోవైపు వివిధ రకాల అంతుపట్టని వ్యాధుల కారణంగా పశుపోషకులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. గ్రాసం కొరతతో పశువులు బక్కచిక్కిపోయి.. ఫలితంగా పాల దిగుబడి తగ్గుతోందని పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఉండవల్లి, తాడేపల్లి, కుంచనపల్లి, మెల్లెంపూడి తదితర ప్రాంతాల్లో కొంతమంది రైతులు డైరీ ఫామ్‌లు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో భూమి కొలు అధికంగా ఉండడంతో పచ్చిగడ్డి వేయాలంటే చాలా ఖర్చుగా మారిందని చెబుతున్నారు.

వాణిజ్య పంటలే అధికం

మంగళగిరి నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులు వాణిజ్య పంటలు పండిస్తున్నారు. పంట పొలాల్లో గడ్డిజాతికి చెందిన గరిక, ఇతర వాటిని తొలగించేందుకు విషపూరిత మందులు వాడడంతో పచ్చిగడ్డి కొరత ఏర్పడింది. మాగాణి భూముల్లో మొక్కజొన్న, జొన్న వేయడం, వాటిల్లో చీడ, పీడ నివారించేందుకు గుళికలు వేయడంతో పచ్చిగడ్డి కొరత బాగా ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. వరిగడ్డి ట్రాక్టర్ ధర రూ.15 వేల నుంచి రూ.20 వేల అవుతోంది. ఎండుగడ్డికి అంతభారీ మొత్తంలో పెట్టుబడి పెట్టలేమని పాడి రైతులు చెబుతున్నారు. తాడేపల్లి పరిధిలో గేదెలు సుమారు అధికారుల లెక్కల ప్రకారం 3,500, ఆవులు 200 ఉన్నాయి. మంగళగిరి పరిధిలో 5 వేల వరకు గేదెలు, 300వరకు ఆవులు ఉన్నాయి. దుగ్గిరాల మండలంలో 7,500 గేదెలు, 80 ఆవులున్నాయి.

పెరుగుతున్న దాణా ఖర్చులు

పశువుల కోసం నూకలు, తవుడు, పెసరపొట్టు, మినప పొట్టును వినియోగిస్తారు. పాడిరైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు ఇష్టారాజ్యంగా వాటి ధరలు పెంచుకుంటూ పోతున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో పెరిగిన ధరకే దాణాను కొనుగోలు చేస్తున్నారు. పాల సేకరణ కేంద్రాల్లో పాల ధర తక్కువగా రావడంతో కనీసం దాణా ఖర్చులు కూడా డబ్బులు రావడం లేదని రైతులు చెబుతున్నారు.

సరైన పోషణ అందించలేకపోతున్నాం



మూడు పాడి గేదెలను పోషిస్తున్నారు. పాలను అమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నాం. వరిగడ్డి కొరత, పెరిగిన దాణా ఖర్చుల్లో వాటికి సరైన పోషణ అందించలేకపోతున్నాం. పశుపోషణ భారంగా మారింది. గేదెలకు రోగాలు వస్తే సరైన వైద్యం చేయించకలేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా పాడి రైతులకు దాణా అందించాలి.

– పోకల సీతానాంచారయ్య, చిర్రావూరు

పశుపోషణ తప్ప ఇంకేం తెలియదు



నేను వ్యవసాయం, పశుపోషణ తప్ప మరో పని తెలియదు. తవుడు కట్ట రేటు రూ.1,600 ఉంది. ఒక గేదెకు నెలకు 25 కేజీల తవుడు అవుతుంది. జొన్నలు రైతు దగ్గర ధర లేదు కానీ మార్కెట్‌లో మాత్రం కేజీ రూ.40లకు అమ్ముతున్నారు. ప్రతిరోజు నూకలు, జొన్నలు కలిపి ఒక్కోగేదెకు కేజీ పండాలి.

– కనకయ్య, పోలకంపాడు

హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



ఫిరంగిపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల హామీలను నెరవేర్చడం లేదని నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వనమాబాల వజ్రబాబు అన్నారు. మండలంలోని మేరికపూడి, 113 తాళ్లూరు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఎన్నికల సాక్షిగా ఇచ్చిన హామీలు అమలు చేయలేక పోతోందన్నారు. విద్యార్థుల పట్ల అవలంభిస్తున్న నిర్లక్షంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలకు నిధులు విడుదల చేయకపోవడం అందుకు నిదర్శనమని చెప్పారు. దీనికి నిరశనగా బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన ఫీజు పోరును విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మద్దతుగా ప్రభుత్వంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, చిట్టా అంజిరెడ్డి, డి.సురేష్, బ్రహ్మారెడ్డి, వెంకట్రామిరెడ్డి, వీరారెడ్డి, చేవూరిరామమోహన్‌రెడ్డి, టి.కృష్ణ, బ్రహ్మారెడ్డి, అంజిరెడ్డి, షేక్.మస్తాన్‌వలి, కె.ప్రవీణ్‌రెడ్డి, సీహెచ్ చిన్న చెంచయ్య, సాంబిరెడ్డి, పి.సింగారెడ్డి, రాజగోపాలరెడ్డి, జయపాల్‌రెడ్డి, ఒ. వెంకట్రావు, వెంకట్రామిరెడ్డి, ఖాజావలిలు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవాలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలో శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఐదోవ రోజు మంగళవారంతో కళ్యాణోత్సవాలు ఘనంగా ముగిశాయి. దేవాలయంలో సుప్రభాత సేవ, నవనీత హారతి, నిత్య కైంకర్యాలు, నవ కుంభారాధన, నరసింహ హోమం, సాయంత్రం నిత్య హోమం, గరుడోత్సవం, ఆలయ బలిహారణ జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ భేరి పూజ, భేరి తాడనం, ద్వాదశ ప్రదక్షణలు, స్వామివారి పవలింపు సేవ, భక్తులకు తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు సాకేత్ శర్మ, రామచంద్ర పర్యవేక్షించారు.

పశువులకు గాలికుంటు టీకా

ఫిరంగిపురం: తక్కెళ్లపాడు గ్రామంలో 75 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకా మంగళవారం వేసినట్లు నుదురుపాడు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని టీకా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఆర్, వినీల, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో గత ఎనిమిది నెలల నుంచి తప్పించుకున్న తిరుగుతున్న ఓ ముద్దాయిని మంగళవారం తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్ నగర్‌కు చెందిన అక్కలసాయి తేజ పలు గంజాయి కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడని చెప్పారు. ఈనెల 7న కృష్ణా కెనాల్ జంక్షన్ వద్ద గంజాయి బ్యాచ్ ఉందన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారని, అందులో నలుగురు పట్టుబడ్డారని, వారిలో సాయితేజ తప్పించుకున్నాడని వివరించారు. సోమవారం ప్రకాష్ నగర్ పాత పంచాయితీ కార్యాలయం సమీపంలో ఉన్నాడని తెలుసుకుని సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నామని కోర్టుకు హాజరుపరిచామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ ఖాజావలి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్ : ప్రభుత్వం కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణతో కలసి మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్మికులకు మద్దతు తెలియజేశారు. నాయకులు మాట్లాడుతూ పాలకులకు చిత్తశుద్ధి ఉంటే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, గత ఎన్నికల ప్రచారం సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఇస్మాయిల్, బాష, ఇమాంబి, దుర్గారావు, గురవయ్య, సాంబయ్య, రహీంతుల్లా, అంకయ్య, సారమ్మ, సామ్రాజ్యం, రిబ్కా పాల్గొన్నారు.

యువత పోరును విజయవంతం చేయాలి



మేడికొండూరు : వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ కందుల సిద్ధయ్య, పార్టీ మండలాధ్యక్షుడు తాళ్లూరు వంశీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ వలి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పేరేచర్లలో యువత పోరు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ముత్యాల బాలస్వామి, గండికోట రసూలు, షేక్ రబ్బాని, ఉడతా ప్రభాకర్, షేక్ సుభాని అబ్బాస్, సుభాని, బషీరు తదితరులు పాల్గొన్నారు.

నీటి కాలుష్యంపై పరిశోధన



పరిశోధనలో ప్రొఫెసర్‌తో పాటు విద్యార్థినులు

తాడేపల్లిరూరల్ : ప్రజల్లో ప్రబలుతున్న వ్యాధుల తీవ్రత గురించి తమ విద్యార్థినులు అధ్యయనం చేసినట్లు కేఎల్‌యూ బయో టెక్నాలజీ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జానకి రామయ్య తెలిపారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బయోటెక్నాలజీ నాల్గవ సంవత్సరం విద్యార్థినులు శివాని, లిఖిత నీటి కాలుష్యం వల్ల ప్రజల్లో ప్రబలుతున్న వ్యాధుల తీవ్రత గురించి పరిశోధనలు చేశారని పేర్కొన్నారు. విద్యార్థిని శివాని మాట్లాడుతూ బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ వి. ప్రవీణ్ సూచన మేరకు బృంద సభ్యులుగా ఏర్పడి నీటి కాలుష్యంపైన పరిశోధనలు చేశామని తెలిపారు. కీలకమైన బ్యాక్టీరియాలలో ఈకోలీ అనే బ్యాక్టీరియా అత్యంత ప్రమాదకరమని వివరించారు. విద్యార్థిని లిఖిత వ్యాధికారక క్రిములను తొలగించడానికి నీటిని 1–3 నిమిషాలు కాచి చల్లార్చి తాగాలని సూచించారు. పరిశోధనలు చేసిన విద్యార్థినులను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కె. రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ వి. ప్రవీణ్ తదితరులు అభినందించారు.

ఘనంగా 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం

మేడికొండూరు: మండలంలోని డోకిపర్రు జోసిల్ కంపెనీలో 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు ఈ నెల 4న ప్రారంభమై మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో జోసిల్ కంపెనీ సెక్రటరీ డీజీఎం కోటా రఘురాం మాట్లాడుతూ కార్మికుల భద్రతకు కంపెనీ అన్ని రకాల సహకారాలు అందిస్తుందని తెలిపారు. భద్రత సమష్టి కృషితోనే సాధ్యమవుతుందని తెలిపారు. కంపెనీ ఇంజనీరింగ్ విభాగ మేనేజర్ కందుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ విధులతో భద్రత ప్రాముఖ్యతను ఎప్పటికప్పుడు గుర్తు చేసుకోవాలన్నారు. భద్రత అనే అంశం సమీప గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కంపెనీ సిబ్బంది, కార్మికుల కుటుంబ సభ్యులైన మహిళలకు వంటగదిలో గ్యాస్ పట్ల తీసుకునే అంశాల పైన వ్యాస రచన పోటీ నిర్వహించారు. బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జోసిల్ కంపెనీ అడ్వైజర్స్ రామినేని బెనర్జీ బాబు, ఎడ్లపాటి భాను ప్రసాద్ కంపెనీ మేనేజర్ షేక్ జానీ భాష, పలువురు వివిధ విభాగాల ఇంజనీర్స్ సూపర్వైజర్స్ వర్కర్స్ కార్మికులు పాల్గొన్నారు.

పౌర సేవల దరఖాస్తులపై రాజకీయ లోగోలు వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

తాడికొండ: వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో పౌర సేవల కోసం ఉపయోగించే దరఖాస్తు ఫారాలపై రాజకీయ నాయకుల చిత్రాలు, పార్టీల లోగోలు ఉండకూడదని తాడికొండ ఎంపీడీవో కె.సమతావాణి సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమావేశంలో ఆమె మాట్లాడుతూ పౌర సేవలకు సంబంధించిన దరఖాస్తులపై రాజకీయ నాయకుల చిత్రాలు ఏమైనా ఉంటే వాటిని వెంటనే తొలగించి ప్రజలకు సేవలందించాలన్నారు. ఇటీవల ఓ సచివాలయంలో రాజకీయ నాయకుల చిత్రాలతో కూడిన సేవల దరఖాస్తు బయటకు రావడంతో డిజిటల్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవడం జరిగిందని గుర్తుచేశారు. ఇకపై అలాంటి పొరబాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఏపీ సివిల్ సేవల నియమావళి 1991 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మీ సేవా కేంద్రాలు, సచివాలయాలతో పాటు ఇతర సేవా కేంద్రాల నిర్వాహకులు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ శివలీల పలువురు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కలశ జ్యోతుల ప్రదర్శన



కలశ జ్యోతులతో స్వాములు

మంగళగిరి టౌన్ : మంగళాద్రిలో నారసింహ మాల ధారణ దీక్ష చేపట్టిన స్వాములు దీక్షలో భాగంగా మంగళవారం రాత్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వాములు నరసింహ జ్యోతుల ప్రదర్శన నిర్వహించారు. లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థాన ప్రధాన అర్చకులు, గురుస్వామి మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసింహ జ్యోతుల ప్రజ్వలన చేసి స్వామి కలశ జ్యోతుల ప్రదర్శన ప్రారంభించారు. శ్రీనివాస దీక్షితులు మాట్లాడుతూ తైలంలో లక్ష్మీదేవి ఉంటుందని, జ్యోతి నారసింహ స్వరూపమని, జ్యోతులకు తైలం సమర్పిస్తే పితృ దేవతలు శాశ్వత వైకుంఠ ప్రాప్తి చెందుతారన్నారు. జ్యోతుల దర్శనం వల్ల నేత్ర సంబంధమైన వ్యాధులు తగ్గుతాయని భక్తుల నమ్మకమని అన్నారు. భక్తులు పరమ పవిత్రమైన నారసింహ కలశ జ్యోతులు దర్శించుకుని తరించారని తెలిపారు. స్వాముల కలశ జ్యోతుల ప్రదర్శన మిద్దె సెంటర్ నుంచి ప్రారంభమై మెయిన్ బజార్, పూల మార్కెట్ సెంటర్, పెదకోనేరు మీదుగా దేవస్థానానికి చేరుకుని స్వాములు కలశ జ్యోతులను శ్రీవారికి సమర్పించారు. ట్రస్ట్ అధ్యక్షులు తోట శ్రీనివాస్, శివారెడ్డి గురుస్వామి, భక్తబృందం ప్రతినిధులు మహేష్, వినయ్, శ్రీను పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన




మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు

దుగ్గిరాల: తడిచెత్త పొడిచెత్తను వేర్వేరుగా డబ్బాల్లో ఉంచి ఇళ్లకు వచ్చే శానిటేషన్ సిబ్బందికి సహకరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం దుగ్గిరాలలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డు వద్ద తడి చెత్త పొడి చెత్త ప్రమాదకర వ్యర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ఆశ వర్కర్లు, గ్రామ సమాఖ్య మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలకు తడి పొడి చెత్త ఏ విధంగా వేరు చేయాలనే అంశాలపై వివరించారు. చెత్తను రోడ్లపై వేయరాదని పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలందరూ సహకరించాలని సూచించారు. ఈవోపీఆర్డీ కె.జె.నెహ్రూ, కార్యదర్శి వివేకానంద్ పాల్గొన్నారు.


యువత పోరుకు తరలిరండి



పోస్టరు విడుదల చేస్తున్న తాడికొండ మండల నాయకులు, కార్యకర్తలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తుళ్లూరు మండల నాయకులు

ఫిరంగిపురం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న యువత పోరుకు యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ చదువుకునే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంటును ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఆయా కళాశాల యాజమాన్యాలు బయటకు పంపించే పరిస్థితి ఏర్పడినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల, యువకుల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్యధోరణికి నిరసనగా నిర్వహించే యువత పోరును విజయవంతం చేయాలని కోరారు. చిట్టా అంజిరెడ్డి, కొమ్మారెడ్డి, చిన్నప్పరెడ్డి, డి.సురేష్, షేక్, సలీం, పెరికల చిన్నా, చేవూరి రామమోహన్‌రెడ్డి, మస్తాన్‌వలి, కె. అప్పిరెడ్డి, వెళాంగిణీరెడ్డి,బి. అంజిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సాల్మన్, రాయప్ప, ఇజ్రాయిల్, వై.ఆశీర్వాదం, పి.శ్రీనివాసరెడ్డి, అమానుల్లా, కె.శ్రీనివాసరెడ్డి, ఆర్,రంజన్‌బాబు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

యువత పోరుకు భారీగా తరలిరండి

తాడికొండ: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరులో చేపట్టనున్న యువత పోరుకు భారీగా విద్యార్థులు, యువత తరలిరావాలని ఆ పార్టీ జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు దాసరి రాజు పిలుపునిచ్చారు. మంగళవారం తాడికొండలో పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి పోస్టరు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, బండారుపల్లి గ్రామ సర్పంచ్ ముప్పాళ్ల మనోహర్, మాజీ సొసైటీ చైర్మన్‌లు వంగా పోలారెడ్డి, చుండు వెంకటరెడ్డి, వివిధ విభాగాల నాయకులు బాకి వెంకటస్వామి, దమ్మాటి మోహనరావు, షేక్ సలీమ్, ముచ్చు ఆనంద్, షేక్ అజీస్, ఉండవల్లి నరసింహారావు, షేక్ జానీ పాల్గొన్నారు.

తుళ్లూరు మండలం దొండపాడులో వైఎస్సార్ సీపీ నాయకులు యువత పోరు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొప్పుల శేషగిరిరావు, కొప్పుల ఆంధ్రీయప్ప, బెజ్జం రాంబాబు, ఆరేపల్లి జోజి, మైనేని నాగ మల్లేశ్వరరావు, చనుమోలు రామారావు, కొయ్యగూర వినోద్, షేక్ జానీ బాషా, పాలకాయల శేషగిరిరావు, డీజే శ్రీనివాసరావు, నేలపాటి నాగేంద్ర, గద్దర్ చెన్నకేశవ మాతంగి, పుట్టి సుబ్బారావు, కొల్లేటి అనీల్, కొప్పుల బాలస్వామి పాల్గొన్నారు.

దుగ్గిరాల: యువతను, నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం అన్నింటా మోసగించిందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభానీ ఆరోపించారు. మంగళవారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం కలెక్టరేట్ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ ఆలపాటికి సత్కారం



మంగళగిరి: పట్టణంలోని జాతీయరహదారి వెంట కల రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయానికి మంగళవారం తొలిసారి సందర్శించిన సందర్భంగా సంఘం నాయకులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా విజయం సాధించడంలో కృషి చేసిన బీసీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. బీసీల సమస్యలు పరిష్కారానికి , సంఘం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఎస్ పుల్లారావు, బాదుగున్నల శ్రీనివాస్, శివరామ్‌బాబాజీ, కేసన స్వాములు, కోలా అశోక్, ఉడత శ్రీనివాసరావు, కాగితాల స్వాతిగౌడ్, జయలక్ష్మి, కిరణ్ పాల్గొన్నారు.